అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ అన్నారు. సోమవారం నాగోలు డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్థ కాలనీ రోడ్ నెంబర్ 5, 6 లో రూ. 31.5 లక్షలతో నిర్మించే డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాలనీలో వర్షాకాలంలో వరద నీరు వెళ్లడానికి సరైన మార్గాలు లేకపోవడంతో ఇళ్లల్లోకి నీరు వచ్చేదని ఈ సమస్యను పరిష్కరించడానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించామన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోకవర్గం, ఆర్‌కే పురం డివిజన్ పరిధిలోని శ్రీరామకృష్ణాపురం ఇన్‌కమ్ టాక్స్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగుల సరూర్ నగర్ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ, ఇస్కాన్ అబిడ్స్ వారి ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్రను సోమావారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూరీ జగన్నాథ స్వామి రథయాత్రని శ్రీ సిద్దేశ్వరి పీఠ ఉత్తర పీఠాధిపతులు శ్రీదత్తేశ్వరానంద భారతి స్వామి దీపారాధన నిర్వహించి ప్రారంభించారు. శ్రీ రామకృష్ణా పురం నుంచి ప్రారంభమైన యాత్ర శ్రీ ప్రతంగిరా దేవి ఆలయం, వారాహి ప్రత్యంగిరా దేవి ఆలయం, శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం, శ్రీ సాయిబాబా ఆలయం, శ్రీ అష్టలక్ష్మి ఆలయాలను సందర్శించి వాసవి కాలనీ ఆధ్యాత్మిక కేంద్రం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో ఆర్‌కే పురం కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, పున్న గణేష్ నిర్మల, రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, గణేష్, రాజేశ్, అన్నపూర్ణ, భాస్కర్, నరహరి రావు పాల్గొన్నారు.


రథయాత్రను ప్రారంభిస్తున్న శ్రీదత్తేశ్వరానంద భారతి స్వామి

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ న్యూమారుతీనగర్ కాలనీలోని ఓ ఇంట్లో సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి కాలిపోయింది. న్యూమారుతీనగర్ కాలనీలో తడకమళ్ల శ్రీనివాస్, మాలతి దంపతులు ఇద్దరు కుమారులతో నివాసం ఉంటున్నారు. శ్రీనివాస్ ప్రవేటు ఉద్యోగి ఆరోగ్యం బాగాలేక పోవటంతో ఇంటి వద్దే ఉంటున్నాడు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో ఇంట్లో మంటలు రావటం గమనించి అందరూ బయటకు పరుగులు పెట్టారు. కాసేపటికి మంటలు వ్యాపించి ఇంట్లోని సామగ్రి అంతా కాలిపోయింది. సమాచారం అందుకున్న చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు, ఎల్‌బీనగర్ ఫైర్ ఆఫీసర్ శ్రీధర్, హైడ్రా, డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. అగ్నిప్రమాదంలో శ్రీనివాస్ పెద్ద కుమారుడు ప్రణవ్(22)కు ముఖం, చేతులకు గాయాలయ్యాయి. హుటాహుటిన చికిత్స నిమిత్తం స్థానిక ఒమ్ని ఆసుపత్రికి తరలించారు. అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త, జీహెచ్‌ఎంసి సరూర్‌నగర్ డిప్యూటీ కమీషనర్ సుజాత, ఉప్పల్ ఆర్‌ఐ అశ్విని అక్కడకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు.


బాధితులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నర్సింహగుప్త, డీసీ సుజాత, ఆర్‌ఐ

పార్కులను అభివృద్ధి చేస్తా

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని పార్కులను అభివృద్ధి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. అనితనగర్‌కాలనీలో సోమవారం ఆయన కాలనీవాసులతో కలిసి మార్నింగ్ వాక్ చేశారు. కాలనీవాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటిని దశలవారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విఠల్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి పాల్గొన్నారు.


మార్నింగ్ వాక్‌లో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కత్తితో పొడిచి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తి రిమాండ్

హస్తినాపురం: మద్యంమత్తులో కత్తితో పొడిచి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు రిమాండ్ తరలించారు. ఇన్‌స్పెక్టర్ తోట మహేశ్ వివరాల ప్రకారం.. హయత్‌నగర్ సాయినగర్‌కాలనీకి చెందిన పోలవరపు తాండవకృష్ణ గత నెల 26న రాత్రి తన స్నేహితులు ఎస్.సాయిమల్లికార్జున్‌రాజు, మాచర్ల సంతోష్, మాచర్ల సతీష్, ఎ.తరుణ్‌తో కలిసి సామనగర్‌లోని జీవీఆర్ కన్వెన్షన్ హాల్ ముందు నిలబడి మాట్లాడుకుంటున్నారు. అప్పుడే అక్కడున్న బార్‌లో నుంచి బయటికి వచ్చిన ఓ వ్యక్తి వీరితో గొడవ పడ్డాడు. కారు డిక్కీలోంచి కత్తి తీసుకువస్తుండగా అక్కడున్న వారు పారిపోవడానికి ప్రయత్నించగా తాండవకృష్ణను పట్టుకుని కడుపులో పొడవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దాడికి పాల్పడిన వ్యక్తి వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాహెబ్‌నగర్‌కు చెందిన నందగిరి రాజుగౌడ్‌గా గుర్తించి రిమాండ్‌కు తరలించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

మలక్‌పేట: సమస్యలు పరిష్కరించడానికి తగిన చర్యలు తీసుకుంటామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సోమవారం అక్బర్‌బాగ్ డివిజన్‌లోని కాలాడేరా, గచ్చిబౌలి, డాక్టర్ జాయేద్ గల్లి ప్రాంతాలోఆయన పర్యటించారు. సివరేజీ లైన్, బాక్స్ డ్రెన్, కొత్త రోడ్ల ఏర్పాటు, కాలనీలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, ఏఈ వెంకన్న, వాటర్ వర్క్స్ మేనేజర్ అల్తాఫ్ ఉన్నారు.


ఎమ్మెల్యే బలాలకు సమస్యలు వివరిస్తున్న కాలనీవాసులు

సకాలంలో పనులు పూర్తి చేయాలి

మలక్‌పేట: అంతర్గత రోడ్లు అందంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శాలివాహననగర్‌లో రూ.6 లక్షల నిధులతో ఏర్పాటు చేయనున్న సీసీ రోడ్డు పనులను సోమవారం కార్పొరేటర్ ప్రారంభించి మాట్లాడారు. బస్తీలు, కాలనీల్లో మౌలిక వసతులు మెరుగు పరచడానికి కృషి చేస్తామన్నారు.

వసతుల కల్పనకు ప్రాధాన్యం

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని కాలనీలు, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని కార్పొరేటర్ జంగం శ్వేతా మధుకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం డివిజన్‌లోని సింగరేణి కాలనీ, ఖాజాబాగ్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోరు పనులను కార్పొరేటర్ పరిశీలించి మాట్లాడారు. ఇటీవల తాను బస్తీల్లో పర్యటించగా సింగరేణి కాలనీ, ఖాజాబాగ్ నివాసితులు తమకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందుతుందని, కానీ సరిపడే నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. అధికారులతో చర్చించి రెండు ప్రాంతాల్లోనూ బోర్లు వేసేందుకు నిర్ణయించామన్నారు.

ప్రభుత్వ స్థలంలో పాఠశాల నిర్మించండి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి సింగరేణి కాలనీలోని ప్రభుత్వ స్థలంలో ఉన్నత పాఠశాల నిర్మించాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక సైదాబాద్ మండలం కన్వీనర్ షేక్ మహమూద్ సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌ను ప్రజావాణిలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. సింగరేణి కాలనీలోని సరళాదేవి హట్స్ ప్రైమరీ పాఠశాల వద్ద 504 గజాల ప్రభుత్వ స్థలం ఉందని, అందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మిస్తే విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.

బిగ్‌-సి షోరూమ్‌లో చోరీ

మలక్‌పేట: మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిగ్-సి షోరూమ్‌లో చోరీ జరిగింది. ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ విక్రాంత్ డెంటల్ ఆసుపత్రి భవనంలో బిగ్-సి షోరూమ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంది. భవనం పైఅంతస్తులో విక్రాంత్ డెంటల్ ఆసుపత్రి, శౌర్య కన్సల్టెన్సీ వెళ్లడానికి మెట్లు ఉన్నాయి. మెట్లకు జాలీతో పాటు షెట్టర్ ఉంది. ఆదివారం రాత్రి ఓ షెటర్ తెరిచి షోరూమ్ గోడకు రంధ్రం చేసి లోపకి వెళ్లాడు. రెండు ఐఫోన్–16, ఇతర కంపెనీలకు చెందిన 8 సెల్‌ఫోన్లు దోచుకెళ్లాడు.

విదేశీ సిగరెట్ల విక్రేత అరెస్ట్

చాదర్‌ఘాట్: నిషేధిత విదేశీ సిగరెట్ల గోదాంపై సౌత్‌ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, చాదర్‌ఘాట్ పోలీసులు దాడిచేసి వ్యక్తిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. సైదాబాద్ ఫరా కాలనీకి చెందిన మహ్మద్ ఫైజల్ (31) అక్బర్‌బాగ్‌లో గోదాంను ఏర్పాటు చేసి అక్రమంగా విదేశీ సిగరెట్ల వ్యాపారం చేస్తున్నాడు. ఢిల్లీకి చెందిన రాహుల్ అనే వ్యక్తి ద్వారా వాటిని తెప్పించుకొని విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు గోదాంపై దాడి చేసి మహ్మద్ ఫైజల్‌ను అరెస్ట్ చేసి రూ. 10.70 లక్షల విలువైన సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు.

కరాటేతో శారీరక దృఢత్వం

చంపాపేట: కరాటే శిక్షణతో ఆత్మస్థైర్యం, శారీరక దృఢత్వంతో పాటు రక్షణకు ఆయుధంలా ఉంటుందని సినీనటుడు సుమన్ అన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన కియో, ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి కరాటే పోటీలకు హాజరై జాతీయ స్థాయి పతకాలను సాధించిన విజేతలకు సోమవారం చంపాపేట డివిజన్ సాయిరాంనగర్ కాలనీ సంక్షేమ సంఘ భవనంలో సెల్యూట్ మాస్టర్ అకాడమీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై అభినందించారు.

బీసీ స్టడీ సర్కిల్‌కు రూ. 15 వేల కోట్లు కేటాయించాలి

చంచల్‌గూడ: బీసీ స్టడీ సర్కిల్‌కు రూ. 15 వేల కోట్లు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది రాజేశ్వర్‌యాదవ్ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేశ్వర్‌యాదవ్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు త్వరగా చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఇంటర డిగ్రీ, పీజీ కోర్సుల స్కాలర్‌షిప్ రూ. 5 వేల నుంచి 25 వేలకు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.